సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 7 । డిసెంబర్ । 2023

న్యూస్‌రీల్

ఘాట్‌లో విరిగిపడుతున్న కొండచరియలు

- రోడ్డుపై భారీగా వరద నీటి ప్రవాహం
- వాహన రాకపోకలను నిలిపివేసిన అధికారులు



పాడేరు ఘాట్‌లో విరిగిపడిన కొండచరియలు

సాక్షి,పాడేరు: భారీ వర్షాల కారణంగా పాడేరు ఘాట్‌లో పలుచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. కొండవాగుల నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రమాదాల నివారణలో భాగంగా వాహనాల రాకపోకలను ముందస్తుగానే నిలిపివేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ పోలీసు శాఖకు ఆదేశాలిచ్చారు. బుధవారం రాత్రి 8.30 గంటల నుంచి ఘాట్‌లో ఇరువైపులా వాహనాలను నిలిపివేశారు. మైదాన ప్రాంతాల నుంచి పాడేరు వచ్చే వాహనాలను ఘాట్ దిగువున ఉన్న తాటిపర్తి ఎస్ఈబీ చెక్‌పోస్టు వద్ద ఆపేశారు. పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్లే వాహనాలను పాడేరుకు సమీపంలోని వంతాడపల్లి చెక్‌పోస్టు వద్ద నిలిపివేశారు. కొండచరియలు జారిపడుతున్న ప్రాంతాలను బుధవారం సాయంత్రం ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు, సిబ్బంది పరిశీలించారు. గురువారం ఉదయం నుంచి తొలగింపు పనులు చేపట్టేందుకు ఆర్అండ్‌బీ, పోలీసుశాఖ కార్యాచరణ రూపొందించాయి.

అనంతగిరి ఘాట్ రోడ్డులో అప్రమత్తం



చిలకలగెడ్డఅటవీశాఖ చెక్‌పోస్ట్ సిబ్బందికి సూచిస్తున్న తహసీల్దార్ రాంబాయి

అనంతగిరి: తుపాన్ కారణంగా ఘాట్‌రోడ్డు కొండచరియలు జారిపడుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశాలతో ఘాట్‌రోడ్డులోని వాహన రాకపోకలను నిలిపివేస్తున్నామని తహసీల్దార్ రాంబాయి బుధవారం రాత్రి తెలిపారు. మండలంలోని చిలకలగెడ్డ చెక్‌పోస్ట్ అటవీశాఖ సిబ్బంది అప్రమత్తం చేశారు. ఘాట్‌రోడ్డులోని ఏటువంటి వాహనాలను పంపించవద్దని ఆదేశించారు. ఘాట్‌రోడ్డులోని అత్యవసర, ప్రభుత్వ వాహనాలు మాత్రమే అనుమతిస్తామన్నారు. ప్రజలందరూ ఈవిషయాన్ని దృష్టిలో పెట్టుకుని, సహకరించాలన్నారు.

కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

రాజవొమ్మంగి: మండలంలోని సూరంపాలెం వద్ద రాజవొమ్మంగి నుంచి రేవళ్ల వైపు వెళ్లే ఏలేశ్వరం డిపోకు చెందిన బస్సు బుధవారం బురదలో కూరుకుపోయి ఒరిగిపోయింది. డైవర్షన్ రోడ్డులో వెళ్తుండంగా బురదలో కూరుకుపోవడంతో డ్రైవర్ వెంటనే అప్రమత్తమయ్యాడు. ప్రయాణికులను కిందికి దింపేయడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. డైవర్షన్ రోడ్డుపై వెళుతుండగా బురదలో కూరుకొని పోయి బస్ ఓ ప్రక్కకు ఒరిగిపోయింది. ఎన్‌హెచ్ రోడ్ నిర్మాణ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని యంత్రాల సాయంతో బస్సును బురదలోంచి బయటకు తీశారు.

మత్స్యగెడ్డలో గల్లంతైన వ్యక్తి మృతి



రామకృష్ణ మృతదేహం

సాక్షి,పాడేరు: మత్స్యగెడ్డ ఒడ్డున చేపలు వేటాడుతూ ప్రమాదవశాత్తు గెడ్డలో జారిపడి కొట్టుకుపోయి గిరిజనుడి మృతదేహం లభ్యమైంది. పెదబయలు మండలం పెదాకోడాపల్లి పంచాయతీ, పరదానిపుట్టు గ్రామ సమీపంలోని మత్స్యగెడ్డ వద్ద బుధవారం మధ్యాహ్నం ఈ ప్రమాద సంఘటన చోటుచేసుకుంది. పరదానిపుట్టు గ్రామానికి చెందిన గిరిజనుడు కిల్లో రామకృష్ణ(40) మరొకరితో కలిసి మత్స్యగెడ్డ వద్దకు చేపలవేటకు వెళ్లాడు. గెడ్డ ఒడ్డు నుంచి వలతో చేపలు పడుతుండగా ఒక్కసారిగా గెడ్డలో జారి పడి గల్లంతయ్యాడు. గెడ్డ ప్రవాహం అధికంగా ఉన్నప్పటికి గ్రామంలో గిరిజనులు గాలింపు చర్యలు చేపట్టారు.సాయంత్రానికి రామకృష్ణ మృతదేహం ఒడ్డుకు కొట్టుకు వచ్చింది.ఈ సంఘటనతో పరదానిపుట్టు గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. మృతుడు రామకృష్ణకు భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు.రామకృష్ణ మృతిపై అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ విచారం వ్యక్తం చేశారు.



పాడేరు మండలం వంజంగి పంచాయతీ కొత్తవలస ప్రాంతంలో వరి పొలాల మీదుగా వరద నీటి ప్రవాహం



పాడేరు మండలం బొక్కెళ్లు కాజ్‌వే మీదుగా ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ



లొద్దిపాకల వద్ద రోడ్డుపై కూలిన చెట్టును తొలగింపును పర్యవేక్షిస్తున్న పోలీసులు



రంపలో వరిపొలాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

సత్వర సాయమే లక్ష్యంగా..

మిచాంగ్ తుపాను బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సత్వరం స్పందించింది. అధికారులను అప్రమత్తం చేసింది. పంట నష్టం అంచనాలపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగంతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎలాంటి అధైర్య పడొద్దని అన్నివిధాలా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈనెల 9నుంచి పంట నష్టం సర్వే చేపట్టేలా జిల్లా యంత్రాంగానికి కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

- అధికార యంత్రాంగం అప్రమత్తం
- బాధితులను ఆదుకునేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం
- ఈనెల 9 నుంచి పంట నష్టం సర్వే: కలెక్టర్ సుమిత్‌కుమార్



తడిచిన వరి పనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, ఐటీడీఏ పీవో అభిషేక్



వరిపనలను పరిశీలిస్తున్నఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

సాక్షి,పాడేరు: తుపాను కారణంగా జిల్లావ్యాప్తంగా జరిగిన పంట నష్టం అంచనాలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈనెల 9 నుంచి పంట నష్టం అంచనా వేసేందుకు సర్వే ప్రారంభం కానుంది. కుంభవృష్టిలా వర్షం కురవడంతో లోతట్టు వ్యవసాయ పంట భూములన్ని వరద ముంపునకు గురయ్యాయి. సుమారు 600 హెక్టార్ల విస్తీర్ణంలో వరిపంటకు నష్టం వాటిల్లిందని జిల్లా వ్యవసాయాధికారి నందు తెలిపారు. రాజ్‌మా, ఇతర కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. చింతూరు డివిజన్‌లోని పత్తి.మిరప పంటలు నీటమునిగాయి. జిల్లావ్యాప్తంగా పంట నష్టాలపై సమగ్ర సర్వేకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో ప్రధాన గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. బుధవారం ఉదయం 8.30కు 3245.6 మిల్లీమీటర్లు, మధ్యాహ్నం 2.30కు 307.4 మిల్లీమీటర్లు, రాత్రి 8.30కు 422.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు అయిందని కలెక్టరేట్ అధికారవర్గాలు తెలిపాయి.

- పాడేరు నుంచి పెదబయలు మండలాల వరకు విస్తరించిన మత్స్యగెడ్డలో వరద ప్రవాహం ప్రమాదకరంగా మారింది. జి.మాడుగుల మండలం కుంబిడిసింగి, పాడేరు మండలం బొక్కెళ్లు, పెదబయలు మండలం పరదానిపుట్టు కాజ్‌వేల మీదుగా మత్స్యగెడ్డ పొంగి ప్రవహించడంతో బుధవారం ఉదయం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి.పరదానిపుట్టు కాజ్‌వే అవతల ఉన్న పెదబయలు, పాడేరు మండలాల్లోని 150 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

హుకుంపేట: మండలంలో చీకుమద్దుల,కొట్నాపల్లి, దుర్గం,గన్నేరుపుట్టు,మెరకచింత ప్రాంతాల్లో వరి పనలు నీటమునిగాయి. దుర్గం పంచాయతీ కేంద్రంలో గిరిజనుల ఇంటి గోడలు దెబ్బతిన్నాయి.

అనంతగిరి: మండలంలో భీంపోల్ పంచాయతీ కేంద్రానికి సమీపంలోగల లువ్వా గెడ్డను దాటుతుండగా ముగ్గురు గల్లంతయ్యారు. వీరిలో అంగన్‌వాడీ టీచర్, మరో మహిళ, ఆటో డ్రైవర్ ఉన్నారు.

డుంబ్రిగుడ: మండలంలో సంపంగి గెడ్డ, చంపపట్టి గెడ్డలు పొంగి ప్రవహిస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరి, చోడి పనలు నీటమునిగాయి.

పెదబయలు: పెదకోడాపల్లి పంచాయతీ పరదానిపుట్టు గ్రామ సమీపంలో వంతెనపై నుంచ మత్స్యగెడ్డ పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ పులి మనోజ్ కుమార్ ఆ ప్రాంతానికి చేరుకుని గెడ్డలోకి దిగకుండా చర్యలు చేపట్టారు.

జి.మాడుగుల: చుట్టమెట్ట రామాలయం వీధిలో వర్షానికి దెబ్బతిన్న ఇళ్ల బాధితులకు సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ లోహితాష్, సభ్యులు జయలక్ష్మి, సూర్యారావు టార్పాలిన్లు అందజేశారు. బాధిత కుటుంబాలను జెడ్పీటీసీ మత్స్యరాస వెంకటలక్ష్మి పరామర్శించారు.

గూడెంకొత్తవీధి: స్థానిక తహసీల్దారు కార్యాలయ సమీపంలో విద్యుత్తు స్తంభంపై చెట్టు కొమ్మ విరిగి పడింది. ఆసమయంలో అటుగా ఎవరూ రాకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది.

చింతపల్లి రూరల్: తాజంగి జలాశయ నీటి ప్రవాహం పెరగడంతో బలబద్రం వంతెన పైనుంచి వరదనీరు ప్రవహించింది. లంబసింగి ఘాట్‌లో నేల కూలిన చెట్టును సీఐ రమేష్, ఎస్ఐ అరుణ కిరణ్, అటవీశాఖ అధికారులు తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

కొయ్యూరు: పెదమాకవరం–రామరాజపాలెం మధ్య తాత్కాలిక కాజ్‌వే కొట్టుకుపోయింది. లొద్దిపాకలలో రోడ్డుకడ్డంగా కూలిన చెట్లను పోలీసులు తొలగించారు.

రంపచోడవరం: వర్షాలకు రంప ప్రాంతంలో దెబ్బతిన్న వరి పొలాలను రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి భరోసా కల్పించారు.

దేవీపట్నం: ఇందుకూరుపేట ఇందుకూరు, దేవారం, శరభవరం పంచాయతీల్లో వరి పొలాలు నీటమునిగాయి. కొండవాగు పొంగి ప్రవహించడంతో ఇందుకూరుపేట రావిలంక గ్రామాల మధ్య రెండు గంటలపాటు రాకపోకలు స్తంభించాయి.

మారేడుమిల్లి : ఘాట్ మార్గంలో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున కలెక్టర్ ఆదేశాల మేరకు మారేడుమిల్లి–చింతూరు ఘాట్‌లో భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిపివేశారు. ఇదే మార్గంలో వాలీసుగ్రీవ్ మలుపు వద్ద బుధవారం ఉదయం ఛత్తీస్‌గఢ్ వెళ్తున్న ఓ లోడ్ లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో కొద్దిసేపు రాకపోకలు స్తంభించాయి. బొడ్లంక కాలువ పొంగి ప్రవహించింది.

కూనవరం: నీటమునిగిన వరి పొలాలను కూనవరం శబరి బ్రిడ్జి వద్ద నుంచి చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య పరిశీలించారు. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని బాధిత రైతులకు ఆయన భరోసా ఇచ్చారు.

రాజవొమ్మంగి: భారీ వర్షానికి తంటికొండ గ్రామంలో జీసీసీ చౌకడిపో, పలు నివాశ గృహాల్లోకి వరద నీరు ప్రవేశించింది. ఈ గ్రామం మీదుగా వెళుతున్న వట్టిగెడ్డ జలాశయం పంట కాలువ వరదనీరు పల్లపు ప్రాంతాలను జలమయం చేసింది.

ఎటపాక: మండలంలో మిర్చి, వరి పంటలు నీటమునిగాయి. ఈ పరిస్థితుల్లో మిర్చి పైరుకు తెగుళ్లసోకే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గోదావరి వరదలో మునిగిన విద్యుత్ మోటార్లను రైతులు ఒడ్డుకు చేర్చుకున్నారు.

గంగవరం : జడేరు– మోహనాపురం మార్గంలో చెట్టు కూలడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గంగవరం– రంపచోడవరం రూట్‌లో కుసుమరాయి బ్రిడ్జి వద్ద, గంగవరం – అడ్డతీగల రూట్‌లో గంగవరం శివారులో నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ రహదారి, కల్వర్టులు కొట్టుకుపోయాయి.

చింతూరు: కాటుకపల్లి వద్ద జాతీయ రహదారిపై చింతచెట్టు నేలకూలడంతో భద్రాచలం, చింతూరు నడుమ రెండుగంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు శ్రమించి చెట్టును తొలగించారు.

వై.రామవరం: మండలంలో కొండవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పంట పొలాల్లో నీరు చేరిన నీటిని తొలగించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.



లంబసింగి ఘాట్‌లో కూలిన చెట్టును జేసీబీతో తొలగిస్తున్న పోలీసు సిబ్బంది



చుట్టుమెట్టలో టార్పాలిన్ అందజేస్తున్న సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి

వర్షపాతమిలా..

జిల్లా వాప్తంగా రాత్రి 8.30 గంటలకు నమోదైన వర్షపాతం వివరాలను కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. డుంబ్రిగుడలో 68.2, అనంతగిరిలో 64.4, హుకుంపేటలో 54.2, అరకులోయలో 50.8,పాడేరులో 40.2, చింతపల్లిలో 27, జి.మాడుగులలో 20.4, గూడెంకొత్తవీధిలో 19, చింతూరులో 13.6, పెదబయలులో 11.8, ముంచంగిపుట్టులో 10.2, కూనవరంలో 8.2, రాజవొమ్మంగిలో 7.2వి.ఆర్.పురంలో 6.8, ఏటపాకలో 6.2, దేవిపట్నంలో 2.4, వై.రామవరంలో 0.8, రంపచోడవరంలో 0.6, మారేడుమిల్లిలో 0.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు.

వరద నీటి తొలగింపునకు చర్యలు

- యుద్ధప్రాతిపదికన చేపట్టాలి
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్‌సిన్హా

సాక్షి,పాడేరు: వర్షాలకు పంటల పొలాల్లో చేరిన వరద నీటిని యుద్ధప్రాతిపదికన తొలగింపు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.బుధవారం ఆయన తన కార్యాలయం నుంచి వ్యవసాయ, ఉద్యానవనశాఖల అధికారులు,తహసీల్దార్లు,ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9వతేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా తుఫాన్ నష్టాలపై సమగ్ర గణన చేపట్టాలని సూచించారు. జిల్లాలో పంట నష్టాలపై రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వానికి నివేదించి,నష్ట పరిహారం ను అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తుపాను నష్టాలపై అధికారులంతా కచ్చితమైన నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కల్వర్టులు,రోడ్లు దెబ్బతింటే వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. రవాణాకు ఎలాంటి అంతరాయం లేకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు.అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వ్యవసాయ,ఉద్యాన పంటలు,పశువులు, ఇళ్ల నష్టాలపై కూడా నివేదికలు సమర్పించాలన్నారు. నీటి నిల్వలు తొలగించేందుకు మోటార్ పంప్‌లను అద్దెకు తీసుకోవాలని సూచించారు. ఇందుకు అవసరమైన నిధులు చెల్లిస్తామని కలెక్టర్ తెలిపారు.

250 హెక్టార్లలో పత్తి పంటకు..

జిల్లాలో సుమారు 600హెక్టార్ల వరకు వరిపంటకు నష్టం జరిగి ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నందు తెలిపారు.పత్తి 250 హెక్టార్ల వరకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉందన్నారు.రాజ్‌మా పంట నష్టాలను అంచనా వేస్తున్నామని కలెక్టర్‌కు నివేదించారు.

ఉద్యానవన పంటల నష్టాలపై అంచనా

జిల్లాలో ఉద్యానవన పంటల నష్టాలపై అంచనాలు వేస్తున్నామని జిల్లా ఉద్యానవనశాఖాధికారి రమేష్ కుమార్‌రావు తెలిపారు.డుంబ్రిగుడ,అనంతగిరి,అరకులోయ మండలాల్లో కూరగాయల సాగు ఉందని, వర్షాలు తగ్గిన వెంటనే నష్టాలపై సమగ్ర సర్వే చేపడతామన్నారు. చింతూరు డివిజన్‌లో 50 ఎకరాల వరకు మిర్చి పంట దెబ్బతినే పరిస్థితి ఉందని కలెక్టర్‌కు నివేదించారు.ఈ టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు అభిషేక్, సూరజ్ గనోరే, చైతన్య పాల్గొన్నారు.

సీఎం దృష్టికి తుపాను నష్టం వివరాలు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్‌సిన్హా, పలుశాఖల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో తుపాను నష్టం వివరాలను కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కాన్ఫరెన్సులో జేసీ శివశ్రీనివాస్,డీఆర్‌వో అంబేద్కర్,జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నందు.జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రమేష్‌కుమార్‌రావు, ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు, సీపీవో ఎస్.ఆర్.కె.పట్నాయక్, హౌసింగ్ ఈఈ బాబునాయక్,పంచాయతీరాజ్ ఈఈ కొండయ్యపడాల్ పాల్గొన్నారు.

పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక

- బాధిత రైతులందరినీ ఆదుకుంటాం
- ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

సాక్షి,పాడేరు: మిచాంగ్ తుపానుకు జరిగిన పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక పంపి, బాధిత రైతులను ప్రతిఒక్కరిని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఉమ్మడి విశాఖ జడ్పీచైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర భరోసా ఇచ్చారు. బుధవారం వంతాడపల్లి పంచాయతీ పరిధిలో ముంపు ప్రాంతాలను వారు పరిశీలించారు. కాలినడకన వెళ్లి వరి, రాజ్‌మా, చోడి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట నష్టాలపై అధికార యంత్రాంగం సమగ్ర సర్వే జరుపుతుందన్నారు. తుపాను కారణంగా ప్రాణ,ఆస్తుల నష్టాలు లేకుండా ప్రభుత్వం ముందుగానే అప్రమత్తమైందన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం అధికార యంత్రాంగాన్ని మరింత అప్రమత్తం చేశారన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకున్నారని వారు పేర్కొన్నారు. ఈక్రాప్ జరుపుకున్న రైతులందరికీ పంట నష్ట పరిహారం అందుతుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షురాలు ఎం.సరస్వతి,డైరెక్టర్ మినుముల కన్నాపాత్రుడు,పార్టీ నాయకులు అల్లాడ నగేష్,పీతాంబరం పాల్గొన్నారు.

ప్రతి ఒక్క రైతును ఆదుకుంటాం

అరకులోయ టౌన్: తుపానుకు నష్ట పోయిన ప్రతి ఒక్క రైతుకు పరిహారం అందిస్తామని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. బుధవారం మండలంలోని చిన్నలబుడు, లోతేరు, పంచాయతీల్లో తుపాను ప్రభావిత ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులు మండల వ్యవసాయాధికారి వద్దకు వెళ్లి పేర్లు నమోదు చేసుకుని పరిహారం పొందాలని సూచించారు. పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ అనంతగిరి అరకు, కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి మండలాల్లో 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. వ్యవసాయశాఖ ద్వారా పంట నష్టం గుర్తించి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. దెబ్బతిన్న పంట కాలువలు, కాజ్‌వేల మరమ్మతులకు అంచనాలు అందజేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతగిరి– అరకు ఘాట్ రోడ్లో మంగళవారం రాత్రి విరిగిపడిన కొండ చరియలను తహసీల్దార్, ఎంపీడీవో, పోలీసుశాఖ సహకారంతో తొలగించామన్నారు. ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న లోతేరు గిరిజనులను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి అవసరమైన వసతులు కల్పించామన్నారు. పర్యాటక ప్రాంతాలను మూసివేసినట్టు చెప్పారు. ఎంపీడీవో వెంకటేష్, తహసీల్దార్ వేణుగోపాల్, ఏడీ మోహనరావు, ఏవో ఫణి, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, సర్పంచ్ రమేష్, ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గల్లంతైన ముగ్గురి కోసం గాలింపు

రంగంలోకి రెస్క్యూ బృందం



గల్లంతైన అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, కుమార్



ఉధృతంగా ప్రవహిస్తున్న లువ్వా గెడ్డ



లువ్వాగెడ్డ చేరుకున్న రెస్క్యూ బృందం సభ్యులు

అనంతగిరి: మండలంలోని భీంపోల్ పంచాయతీ కేంద్రం సమీపంలోగల లువ్వా గెడ్డ వద్ద బుధవారం సాయంత్రం గల్లంతైన ముగ్గురి కోసం చీకటి పడేవరకు గాలింపు చర్యలు కొనసాగాయి. ఈ ఘటనలో సీతపాడు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ గెమ్మెల లక్ష్మీ(50), మిరియాల కమల(40), గెమ్మెల కుమార్(25) గల్లంతయ్యారు. గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తున్నందున పూర్తిస్థాయిలో గాలింపు చర్యలకు పరిస్థితులు అనుకూలించడం లేదు.తహసీల్దార్ రాంబాయి, ఎంపీడీవో శ్రీహర్షిత్, ఎంపీటీసీ అశోక్, సర్పంచ్ భీమ్మలమ్మ ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు నిలిపివేశామని, గురువారం ఉదయం మళ్లీ కొనసాగిస్తామని ఎస్ఐ కరక రాము తెలిపారు.

కేకే లైన్‌లో పునరుద్ధరణ పనుల పూర్తి

తాటిచెట్లపాలెం: కేకే లైన్‌లో తైడ–శివలింగపురం సెక్షన్ మధ్య రైల్వే ట్రాక్‌పై విరిగిపడిన కొండచరియలను తొలగించి గూడ్స్ రైళ్ల రాకపోకలను బుధవారం పునరుద్ధరించారు. ఈ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం కొండచరియలు విరిగిపడగా వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్, సీనియర్ అధికారులతో కలిసి హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. విశాఖపట్నం, కోరాపుట్, అరకు నుంచి యాక్సిడెంట్ రిలీఫ్ రైళ్లు, సిబ్బందిని రప్పించి మంగళవారం రాత్రంతా పునరుద్ధరణ పనులు చేపట్టారు. ట్రాక్‌లపై నుంచి బండరాళ్లు తొలగించి గూడ్స్ రైళ్ల రాకపోకలను బుధవారం ఉదయం 9.30 గంటలకు పునరుద్ధరించారు. ఈ ప్రాంతంలో లైన్ క్లియర్ చేసినప్పటికి, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే రైళ్లు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. అప్పటికే అరకు చేరుకున్న కిరండూల్–విశాఖపట్నం (08552) రైలులో ఉన్న సుమారు 199 మంది ప్రయాణికులను మూడు ప్రత్యేక బస్సుల్లో విశాఖపట్నం తరలించారు.

రద్దయిన రైళ్లు

బుధవారం రాత్రి విశాఖలో బయల్దేరాల్సిన విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్, గురువారం రాత్రి కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 7వ తేదీన విశాఖలో బయల్దేరాల్సిన విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్, ఈ నెల 8వ తేదీ కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రద్దు చేశారు.



పనులను పర్యవేక్షిస్తున్న డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్

నాలుగు నామినేషన్లు దాఖలు

కొయ్యూరు: గిరిజన సహకార సంస్థ పాలకవర్గానికి సంబంధించి జరగనున్న ఎన్నికలకు సంబంధించి డైరెక్టర్ల స్థానాలకు నలుగురు నామినేషన్లు వేశారని ఎన్నికల అధికారి వీరబాబురెడ్డి తెలిపారు. పాట్టిక సత్యనారాయణ,కోడా వెంకటరమణ, కుడుముల రాజు, తూబే చిన్నాల దొరలు నామినేషన్లు వేశారని ఆయన పేర్కొన్నారు. ఈనెల 13వ తేదీన ఎన్నిక నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

సివిల్స్ ఉచిత శిక్షణకు ఇంటర్వ్యూలు


రంపచోడవరం: ఐటీడీఏ ద్వారా సివిల్ సర్వీసెస్, గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలు రాసేందుకు ఉచితంగా ఇచ్చే శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే సూచించారు. సివిల్ సర్వీసెస్, గ్రూప్–1, గ్రూప్– 2 ఉద్యోగాల శిక్షణకునిర్వహించిన రెండవ లెవెల్ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు బుధవారం పీవో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 120 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. వీరిలో 38 మంది అభ్యర్థులకు పీవో ఇంటర్వ్యూలు నిర్వహించారు. రంపచోడవరం, మారేడుమిల్లి, దేవీపట్నం మండలాలకు సంబంధించిన అభ్యర్థులకు కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు పూర్తి చేశామన్నారు. మూడు రోజులపాటు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఏపీవో జనరల్ సీహెచ్.శ్రీనివాసరావు, డీడీ జాన్‌రాజ్, ట్రైనీ డీటీబ్ల్యూవో తేజస్విని పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అఖండ అర్చన



పూజా కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్పమాలధారులు

సాక్షి, పాడేరు: స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అయ్యప్పస్వామి విగ్రహానికి బుధవారం అఖండ అర్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.భారీ వర్షంలోను అయ్యప్పస్వామి మాలాధారణ చేసిన భక్తులంతా ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామికి పలు అభిషేకాలు జరిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి రామం, గురుస్వాములు సత్యనారాయణ, ఈశ్వరరావు, ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు. వర్తక సంఘం నేత ఉప్పల వెంకటరత్నం, వైదేహి దంపతులు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు.



సాక్షి, విశాఖపట్నం: భారత నౌకాదళంలో కీలక ప్రాంతంగా విశాఖపట్నం అభివృద్ధి చెందుతోంది. సముద్ర జలాల పరిరక్షణ, ప్రపంచ వాణిజ్య కార్యకలాపాలు సాగించే కీలకమైన భద్రతకు అవసరమైన షిప్‌లు, జలాంతర్గాములు, సర్వే వెసల్స్.. విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నౌకాదళంలో కేంద్రీకృతం కానున్నాయి. సిటీ ఆఫ్ డెస్టినీ కాస్తా సిటీ ఆఫ్ డిఫెన్స్‌గా రూపాంతరం చెందేలా ఏకంగా రూ.2వేల కోట్లకు పైగా నిధులతో తూర్పు నౌకాదళాభివృద్ధి పనులు మొదలయ్యాయి. కీలకమైన యుద్ధ నౌకలతో పాటు ఇండియన్ నేవీలో రెండో యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ కూడా విశాఖ నుంచే కార్యకలాపాలు నిర్వహించనుంది. నౌకాదళానికి కేంద్ర బిందువుగా మారనున్న నేపథ్యంలో ప్రతిష్టాత్మక మిలాన్ విన్యాసాలను ముంబయిలో కాకుండా.. వరసగా రెండోసారి విశాఖలోనే నిర్వహించాలని రక్షణ మంత్రిత్వ శాఖ నిర్ణయించడం విశేషం.

1968లో చిన్న అవుట్ పోస్ట్‌గా ప్రారంభమైనప్పటి నుంచి.. నౌకాదళంలో కీలకంగా ఎదిగింది విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నావికాదళం. తూర్పు తీరం వెంబడి 2,562 కి.మీల విస్తీర్ణంలో స్థావరాలను ఏర్పాటు చేస్తూ.. తీర పరిరక్షణలో ముఖ్య భూమిక పోషిస్తోంది.

దేశంలోని అన్ని సాయుధ దళాల కమాండ్‌లలో భౌగోళిక పరంగా 'ది లార్జెస్ట్ కమాండ్'గా విస్తరించి ఉంది. ఈఎన్‌సీలో ప్రస్తుతం 37 వేలకు పైగా సిబ్బంది ఉండగా.. ఇందులో 2,895 మంది అధికారులు, 21,085 మంది నావికులు, 3,695 డీఎస్‌సీ సిబ్బంది, 9,689 మంది రక్షణ పౌరులున్నారు. భారత ప్రభుత్వం లుక్ ఈస్ట్ పాలసీ ప్రవేశపెట్టిన తర్వాత.. సముద్ర వాణిజ్యానికి తూర్పు తీరం ప్రధాన కేంద్రంగా మారడంతో వాణిజ్య నౌకల రక్షణ బాధ్యత కూడా తూర్పు నౌకాదళమే నిర్వర్తిస్తోంది. దీంతో పాటు డీఆర్‌డీవో కార్యకలాపాలకు కూడా తూర్పు తీరమే వేదికగా మారింది. పలు క్షిపణులు తయారు చేసే నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబొరేటరీస్(ఎన్ఎస్టీఎల్) కూడా విశాఖలోనే ఉంది. ఇలా.. ఈఎన్‌సీ బలీయమైన శక్తిగా మారింది.

ఆయుధ సంపత్తి పెరుగుతోంది



ప్రపంచ రక్షణ దళాల్లో కీలకంగా వ్యవహరించేలా.. తూర్పు నౌకాదళం ఆయుధ సంపత్తి విషయంలోనూ బలోపేతం కానుంది. ఐఎన్ఎస్ ఢిల్లీ, ఐఎన్ఎస్ ముంబయి ఐఎన్ఎస్ మైసూర్ యుద్ధ నౌకలు త్వరలోనే విశాఖ నుంచే కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. 2037 నాటికి పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారవుతున్న 20 నుంచి 25 యుద్ధ నౌకలు తూర్పు నౌకాదళ అమ్ములపొదిలో చేరనున్నాయి. ఇందులో నీలగిరి క్లాస్ ఫ్రిగేట్‌లు, నెక్ట్స్ జనరేషన్ కార్వెట్ క్లాస్ షిప్‌లు, డైవింగ్ సపోర్ట్ వెసల్స్, సర్వే వెసల్స్, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్‌లు, వాటర్ క్రాఫ్ట్‌లు, న్యూక్లియర్ సబ్‌మెరైన్‌లు రాబోతున్నాయి. అదే విధంగా మల్టీ–రోల్ 60ఆర్ 60ఆర్, అప్‌గ్రేడ్ చేసిన యాంటీ సబ్‌మెరైన్ కమోవ్ 28 హెలికాప్టర్లు, మీడియం లిఫ్ట్ ఈ–295 ఎయిర్‌క్రాఫ్ట్‌లు కూడా విశాఖలో కేంద్రీకృతం కానున్నాయి. సర్వే వెసల్స్‌లో మొదటిది సంధాయక్ వచ్చే ఏడాది ప్రారంభంలో తూర్పు నౌకాదళ అమ్ములపొదిలో చేరనుంది. భారత నౌకాదళానికి డైవింగ్ సపోర్టు షిప్‌లను విశాఖలోని హిందూస్థాన్ షిప్‌యార్డులోనే నిర్మిస్తుండటం విశేషం. మరోవైపు ఇండియన్ నేవీలో రెండో యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ సైతం విశాఖ కేంద్రంగా సేవలందించనుంది. వచ్చే ఏడాది మొదటి త్రైమాసికంలోనే విశాఖ రానుంది. వీటన్నింటితో రాబోయే రోజుల్లో విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నౌకాదళం.. దేశ రక్షణ వ్యవస్థకు పెద్దన్నలా మారనుంది.

విశాఖలో మరోసారి మిలాన్



తూర్పు నౌకాదళం మరింత బలోపేతం అవుతోంది. ప్రపంచ దేశాల స్నేహపూర్వకంగా వాణిజ్య వ్యవహారాలు సాగించేలా ఈఎన్‌సీ వ్యవహరిస్తోంది. విశాఖ ప్రజలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రక్షణ వ్యవస్థకు సంపూర్ణ సహకారం అందుతోంది. తూర్పు సముద్ర తీరంలో ఏ సవాలు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ఎప్పటికప్పుడు ఆయుధ సంపత్తి పెంచుకుంటూ ముందుకు వెళ్తున్నాం. మన యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు హిందూ మహాసముద్ర ప్రాంతంలోని తూర్పు చోక్ పాయింట్, మలక్కా జలసంధి, సుండా జలసంధి, లాంబాక్ జలసంధి, ఓంబే–వెటార్ జలసంధితో సహా వ్యూహాత్మక ప్రాంతాల్లో ఉనికిని ప్రదర్శించేందుకు నిరంతరం మోహరించి ఉంటాయి. అందుకే.. తూర్పు నౌకాదళం క్రమంగా ఎదుగుతూ వస్తోంది. ఈ కారణంగానే మరోసారి విశాఖ వేదికగా మిలాన్–2024 నిర్వహించాలని నిర్ణయించాం. ఏ సహకారం కావాలన్నా తాము అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ భరోసాతో 50 దేశాలతో రికార్డు స్థాయిలో మిలాన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, ఈఎన్‌సీ చీఫ్

రక్షణ రంగంలో రారాజుగా...



ఆయుధ సంపత్తిని పెంచుకుంటూ రక్షణ రంగంలో రారాజుగా మారుతోంది ఈస్టర్న్ నేవల్ కమాండ్. ఇప్పటికే నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ(ఎన్ఎస్టీఎల్), నేవల్ ఆర్మ్‌డ్ డిపో(ఎన్ఏడీ)తో పాటు ఎయిర్ స్టేషన్ ఐఎన్ఎస్ డేగా.. ఇలా ప్రతి అంశంలోనూ విశాఖ నగరం కేంద్రంగా మారింది. మరింత బలోపేతం అయ్యేందుకు సాంకేతికతను అందిపుచ్చుకునేలా ఈఎన్‌సీ కేంద్రాన్ని అప్‌గ్రేడేషన్ చేస్తున్నారు. సాంకేతిక మౌలిక సదుపాయాలను పెంపొందించడంలో గణనీయమైన పురోగతిని సాధించే దిశగా రూ.2,192 కోట్లతో 37 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. భద్రతా నిబంధనలకు అనుగుణంగా విశాఖ విమానాశ్రయం రన్‌వే పునరుద్ధరణ ప్రక్రియ కూడా చేపట్టారు. దీనికి అనుబంధంగా నేవల్ ఎయిర్ బేస్ ఐఎన్ఎస్ డేగాలో ఎయిర్ ఫీల్డ్ లైటింగ్ సిస్టమ్ అప్‌గ్రేడేషన్ జరుగుతోంది. ఇది పూర్తయితే భారత నౌకాదళం విశాఖపట్నం నగరానికి ప్రపంచ స్థాయి ఎయిర్‌ఫీల్డ్‌ను అందించనుంది. ఇది విమానయాన భద్రతలో అత్యున్నత ప్రమాణాలకు అనుగుణంగా ఉండబోతోంది.

ముంచంగిపుట్టులో విస్తృత తనిఖీలు

ముంచంగిపుట్టు: తనిఖీల సమయంలో పోలీసులకు ప్రజలంతా సహకరించాలని ఎస్ఐ రవీంద్ర అన్నారు.మండల కేంద్రంలో బుధవారం ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు.సీఆర్‌పీఎఫ్ పోలీసులు బలగాలు సైతం మండల కేంద్రంలో గస్తీ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సోదాలు చేస్తున్నామని చెప్పారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



ముంచంగిపుట్టులో గస్తీ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసు బలగాలు

పి.యర్రగొండ గురుకుల ప్రిన్సిపాల్ సరెండర్



మరుగుదొడ్ల తలుపులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గురుకుల బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావును ఆ శాఖ ఉన్నతాధికారులు ఐటీడీఏకు సరండర్ చేశారు. కళాశాల విద్యార్థినుల సమస్యలు పట్టించుకోకుండా, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారన్న అభియోగాలు ఆయనపై రావడంతో ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. ఆయన బాధ్యతలను అదే కాంపౌండ్‌లో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణకు బుధవారం అప్పగించారు. వెంటనే ఆయన స్పందించి విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరుగుదొడ్ల డోర్లు, నీరు, తదితర సమస్యలను పరిశీలించి, వెంటనే మరమ్మతులు చేపట్టారు. వారం రోజుల్లో సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.

గౌహతి-బెంగళూరు మధ్య ఒన్‌వే స్పెషల్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గౌహతి–బెంగళూరు మధ్య వన్‌వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. గౌహతి–బెంగళూరు(05670) వన్ వే స్పెషల్ గౌహతిలో ఈ నెల 9వ తేదీన ఉదయం 6 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 3.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు 11వ తేదీ ఉదయం 9.10 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు 1–థర్డ్ ఏసీ, 7 స్లీపర్ క్లాస్, 8–జనరల్ సెకండ్ క్లాస్, 2–సెకండ్ క్లాస్ కోచ్‌లతో నడుస్తుంది. ఈ నెల 7వ తేదీన హౌరాలో బయల్దేరాల్సిన హౌరా–తిరుచ్చిరాపల్లి(12663) ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిలు



అరకులోయలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళిర్పిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నేతలు

జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయసాధనే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మిఅన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ అంబేడ్కర్ ఆశయాలకు తగ్గట్టుగానే రాష్ట్రంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి బడుగు,బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు.అనేక సంక్షేమ పథకాల ద్వారా సామాజిక,ఆర్థిక ప్రగతికి చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు.

అరకులోయ టౌన్: డాక్టర్ అంబేడ్కర్ ఆశయ లక్ష్యమే ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో వెంకటేష్, డుంబ్రిగుడ జెడ్పిటీసీ జానకమ్మ, ఎంపీపీలు ఉషారాణి,ఈశ్వరి, మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్,ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు పాల్గొన్నారు.

సమన్వయంతో ముక్కోటి ఏకాదశి నిర్వహణ

- 23న ఉదయం 5 గంటల నుంచి 11.30 గంటల వరకు ఉత్తర ద్వార దర్శనం
- సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి వెల్లడి

సింహాచలం : అన్ని శాఖల సమన్వయంతో ఈ నెల 23న సింహగిరిపై ముక్కోటి ఏకాదశి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆయన బుధవారం మధ్యాహ్నం పోలీస్, జీవీఎంసీ, ఆర్టీసీ, మెడికల్ అండ్ హెల్త్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏకాదశి రోజున సుమారు 50 వేల మంది భక్తులు నృసింహ స్వామి దర్శనానికి వస్తారని అంచనా వేశామన్నారు. అందుకు తగ్గట్టు క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ ఉత్తర రాజగోపురంలో వేకువజామున 5 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు ఉత్తర ద్వార దర్శనం భక్తులకు లభిస్తుందన్నారు. ఉచిత దర్శనం, రూ.100, రూ.300 టిక్కెట్లతోపాటు కేవలం ఉత్తరద్వార దర్శన సమయంలో చెల్లుబాటయ్యేలా అదనంగా రూ.500 టిక్కెట్లు ఉంటాయన్నారు.

భక్తులకు పక్కాగా ఏర్పాట్లు

భక్తులకు తాగునీరు, ఉచిత ప్రసాదం, అన్నదాన భవనంలో పొంగలి, పులిహోర ప్రసాదం అందిస్తామని ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. ముగ్గురు వైద్యులు, ఆరుగురు పారా మెడికల్ సిబ్బంది చొప్పున రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెల 22 సాయంత్రం నుంచి 23 సాయంత్రం వరకు వైద్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. దేవస్థానం అంబులెన్స్‌తోపాటు 108 వాహనం కూడా అందుబాటులో ఉంటుందన్నారు. అగ్నిమాపక శకటాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు. 23న తెల్లవారుజామున 3 గంటల నుంచి పది ఆర్టీసీ బస్సులు నడుపుతామని తెలిపారు. కొండ దిగువన, సింహగిరిపైన పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్‌కు లేఖ రాశామన్నారు. ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్సవం నిర్వహణలో ట్రాఫిక్‌ను పక్కాగా నియంత్రిస్తామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. దేవస్థానం ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, రమణాచార్యులు, పురోహిత్ సీతారామాచార్యులు, ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్, గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ సంతోష్‌కుమార్, ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్, అడవివరం ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ సుదర్శన్, సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్, జీవీఎంసీ జోన్ – 8 ఏఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణంరాజు, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ ప్రసాదరావు, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్‌రాజ్, శ్రీదేవి వర్మ, రామలక్ష్మి, శ్రీదేవి, సాయి నిర్మల, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నృసింహ హోమం టికెట్లు

సింహాచలం : స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై ఈనెల 10వ తేదీన జరిగే నృసింహ హోమం టికెట్లు ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉంటాయని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆరోజు ఉదయం 7 గంటల నుంచి నృసింహ హోమం ప్రారంభమవుతుందన్నారు. భక్తులు www.aptemper.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా టికెట్లు పొందవచ్చని పేర్కొన్నారు.

హిందీ పరీక్షల ఫీజు గడువు ఈ నెల 15

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ–చెన్నై ఆధ్వర్యంలో 2024 ఫిబ్రవరిలో నిర్వహించే పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక తదితర పరీక్షలకు హాజరయ్యేవారు ఈ నెల 15లోగా ఫీజులు చెల్లించవచ్చు. విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు భీమిలి ఆదర్శ హిందీ ప్రేమ మండలి అధ్యక్షుడు కృష్ణారావు తెలిపారు. వివరాలకు 89856 47419, 89858 97419 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తుపాను ముంపు దృశ్యాలు



కూనవరం: నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో చైతన్య



చింతపల్లి మండలం బలభద్రం వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



చుట్టుమెట్టలో బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి



ఎటపాక మండలంలో నీట మునిగిన మిర్చి తోటలు



గంగవరం- అడ్డతీగల మార్గంలో కోతకు గురైన డైవర్షన్ రహదారి



మత్స్యగెడ్డ వద్ద నిఘా ఏర్పాటుచేసిన పెదబయలు ఎస్ఐ పులి మనోజ్‌కుమార్



గూడెంకొత్తవీధిలో విద్యుత్తు స్తంభంపై పడిన చెట్ల కొమ్మలు



రాజవొమ్మంగి మండలం తంటికొండలో నీట మునిగిన డీఆర్ డిపో, గృహాలు



కొయ్యూరు మండలం రామరాజుపాలెం- పెదమాకవరం వద్ద కొట్టుకుపోయిన కాజ్‌వే